

విశాఖ-వారణాసి రైలును త్వరితగతిన ప్రారంభించాలి

శ్రీకాకుళం అర్బన్ : ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడేలా రైల్వేశాఖ మరిన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. పలు రైళ్ల ప్రారంభం, పొడిగింపు, హాల్ట్, మౌలిక సదుపాయాల సమస్యలపై తూర్పు కోస్తా రైల్వే జిఎం సిన్హా, ఖుర్దా రోడ్డు డివిజన్ డిఆర్ఎం హెచ్ఎం బజ్వాకు వివరించారు. ఖుర్దా రోడ్డులో శుక్రవారం నిర్వహించిన డివిజన్ సమావేశంలో ఆయన ప్రస్తావించారు. విశాఖపట్నం-వారణాసి రైలు మంజూరుపై కృతజ్ఞతలు తెలిపిన ఆయన కార్యచరణలో జాప్యాన్ని నివారించి, త్వరితగతిన రైలును అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. హౌరా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు ఇచ్ఛాపురంలో హాల్ట్ కల్పించాలని పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా మీదుగా వారానికి రెండు రోజులు రాకపోకలు సాగిస్తున్న భువనేశ్వర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను రోజూ నడపాలని విన్నవించారు.

సకాలంలో పూర్తయ్యేనా?

- డిసెంబర్ 31తో ముగియనున్న 'వంశధార' ఒప్పందం గడువు
- అసంపూర్తిగా పనులు
- మరోసారి పొడిగింపు అనివార్యం
- వచ్చే ఏడాది జూన్ నాటికి సిద్ధమవుతుందని అంచనా

వంశధార ప్రాజెక్టు నిర్మాణ ఒప్పంద కాలపరిమితిని మరోసారి పొడిగించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పలుమార్లు కొనసాగింపు ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం, తాజాగా ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఆ సమయానికి పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. దీంతో మరోసారి పొడిగింపు ఉత్తర్వులు ఇవ్వాల్సిన పరిస్థితులు అనివార్యంగా కనిపిస్తున్నాయని వంశధార ప్రాజెక్టు అధికారుల మాటల్లో వ్యక్తమవుతోంది. వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసి ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్లుగా అధికారుల్లో చర్చ నడుస్తోంది. ఆరేడేళ్లుగా అదిగో ఇదిగో నీళ్లు ఇచ్చేస్తామంటూ పాలకులు చెప్తూనే ఉన్నా అది నెరవేరడం లేదు. వచ్చే ఏడాది ఖరీఫ్‌కు నీళ్లుఅందిస్తామని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకున్న నేపథ్యంలో అది ఎంతవరకు నెరవేరుతుందన్నది చూడాల్సి ఉంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార ఫేజ్-2 స్టేజ్-2 ప్రాజెక్టు పనులకు రూ.933.90 కోట్లతో 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. ప్రాజెక్టు పనులను 87, 88 ప్యాకేజీలు, హిరమండలం రిజర్వాయర్ పనులుగా విభజించారు. 87 ప్యాకేజీ పనులను హర్విన్ కన్‌స్ట్రక్షన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌కు, 88 ప్యాకేజీ పనులను శ్రీనివాస కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్‌కు, హిరమండలం రిజర్వాయర్ పనులను సోమ-పటేల్ కంపెనీకి అప్పటి ప్రభుత్వం అప్పగించింది. 2008 జూలై నాటికి 87 ప్యాకేజీ పనులు 31 శాతం, 88 ప్యాకేజీ పనులు 36 శాతం పూర్తయ్యాయి. హిరమండలం రిజర్వాయర్ పనులు 60 శాతం మేర పూర్తయ్యాయి. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ప్రాజెక్టు పనుల అంచనాలను రూ.1616.23 కోట్లకు పెంచింది. 2019 వరకు 87 ప్యాకేజీ పనులు 64 శాతం, 88 ప్యాకేజీ పనులు 81 శాతం, హిరమండలం రిజర్వాయర్ పనులు 87 శాతం పూర్తయ్యాయి. ఇప్పటివరకు రూ.1650.20 కోట్లను ఖర్చు చేశారు.



కొత్తూరులో చేపడుతున్న 88 ప్యాకేజీ కాలువ లైనింగ్ పనులు

మందకొడిగా ప్రాజెక్టు పనులు

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మరోమారు ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.2,671.52 కోట్లకు పెంచారు. రెండున్నరేళ్ల కాలంలో నిర్మాణ పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. వీటిలో 87 ప్యాకేజీ పనులు 90 శాతం పూర్తయ్యాయి. అంచనా వ్యయం రూ.173.41 కోట్లు కాగా, ఇప్పటివరకు 124.87 కోట్లు ఖర్చు చేశారు. లైనింగ్ పనులకు సంబంధించి ఇప్పటివరకు 7.63 కిలోమీటర్లు పూర్తి కాగా, మరో 3.83 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు పురోగతిలో ఉన్నాయి. అండర్ పాసేజ్‌లు, వంతెనలు తదితర నిర్మాణాలు 25 వరకు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 24 నిర్మించారు. ఒప్పంద కాలపరిమితిని ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ వరకు పొడిగించారు. 88 ప్యాకేజీ పనులు 94 శాతం పూర్తయ్యాయి.

అంచనా వ్యయం రూ.192.66 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.156.83 కోట్లు ఖర్చు చేశారు. లైనింగ్ పనులకు సంబంధించి ఇప్పటివరకు 16.6 కిలోమీటర్లు పూర్తి కాగా, మరో 1.19 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు పురోగతిలో ఉన్నాయి. అండర్‌పాసేజ్‌లు, వంతెనలు తదితర నిర్మాణాలు 37 వరకు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 36 నిర్మించారు. ప్యాకేజీ పనులు అక్టోబరు 28, 2017 నాటికి పూర్తి కావాల్సి ఉంది. పలు కారణాలతో పనులు సకాలంలో చేపట్టకపోవడంతో, ఆరు నెలలకోసారి పొడిగించారు. పనులు పూర్తి చేసేందుకు చివరిసారిగా ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు.

రిజర్వాయర్ పనులు 95 శాతమే

హిరమండలం రిజర్వాయర్ పనుల అంచనా వ్యయం రూ.419.03 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.376.31 కోట్లను వెచ్చించారు. మూడేళ్లలో పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. వంశధార ప్రాజెక్టు పూర్తికి అనేక పర్యాయాలు ఒప్పంద కాలపరిమితిని పొడిగించినా, ఏనాడు అనుకున్న సమయానికి పూర్తి కాలేదు. 2015లో జరిగిన ఒప్పందం ప్రకారం అక్టోబర్ 28, 2017 నాటికి పూర్తి కావాలి. ఇప్పటివరకు 94.5 శాతం పనులు పూర్తయ్యాయి. పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో అప్పట్నుంచి ఆరు మాసాలు చొప్పున పొడిగిస్తూ వచ్చారు. చివరిసారిగా ఈ డిసెంబర్ 31వ తేదీ వరకు మరోసారి పొడిగించారు.

పెండింగ్‌లో భూసేకరణ

వంశధార ప్రాజెక్టుకు సంబంధించి మరోవైపు భూసేకరణ కూడా పెండింగ్‌లో ఉంది. 87 ప్యాకేజీ కింద చేపడుతున్న కాలువ తవ్వకాలకు 71.32 ఎకరాల భూమి అవసరం. అధికారులు ఇప్పటికే భూసేకరణ పూర్తి చేసినా, సంబంధిత రైతులకు రూ.9.20 కోట్లు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటివరకు నిధులు విడుదల చేయకపోడంతో, కాలువ తవ్వకాలు ముందుకు సాగడం లేదు. అదేవిధంగా 88 ప్యాకేజీ కింద చేస్తున్న కాలువ పనులకు 20.16 ఎకరాలు కావాల్సి ఉంది. రైతులకు రూ.2.92 కోట్లు చెల్లించాల్సి ఉంది. పనులు మందకొడిగా సాగుతుండడం, భూసేకరణ పెండింగ్‌లో ఉండడంతో ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ లోగా పూర్తి కావడంపై అనేక సందేహాలు నెలకొన్నాయి. దీంతో మరోసారి ఒప్పందం కాలపరిమితి పొడిగించాల్సిన పరిస్థితులు రావచ్చనే అభిప్రాయాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు.



మాట్లాడుతున్న కూన రవికుమార్

వైసిపి ప్రచారానికి ఉద్యోగులా..?

- ప్రజలు ఎపి హేట్స్ జగన్ అంటున్నారు
- టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జగన్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులను సర్వీసు రూల్స్‌కు విరుద్ధంగా ఎపి నీడ్స్ జగన్ పేరిట వైసిపి ప్రచారానికి వాడుకుంటోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అధికార యంత్రాంగాన్ని పార్టీ కార్యక్రమాలకు వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. చట్టాలపై గౌరవం, న్యాయస్థానాలంటే భయం లేకుండా జగన్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కులం, మతం చూడబోమని డబ్బా కొట్టుకుంటున్న వైసిపి నాయకులు, టిడిపి సానుభూతిపరులకు పథకాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. వాలంటీర్లను అడ్డం పెట్టుకుని టిడిపి సానుభూతిపరుల ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ఎపి నీడ్స్ జగన్ అంటూ ఉద్యోగుల చేత ఊడిగం చేయిస్తున్నారని దుయ్యబట్టారు. వైసిపి నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులను ప్రజలు ఛీదరిస్తుండడంతో, అధికార యంత్రాంగాన్ని ప్రజల వద్దకు పంపిస్తూ జగన్‌కు ఓట్లు వేయాలని ఒత్తిడి చేయిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ప్రజలు ఎపి హేట్స్ జగన్ అంటున్నారన్నారు. సర్వీస్ రూల్స్‌కి విరుద్ధంగా వైసిపి కార్యక్రమాల్లో పాల్గొంటున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వెళ్లే అధికారులను కోర్టులో నిలబెడతామని హెచ్చరించారు. అసలు జగన్ ఎందుకు కావాలని ప్రజలు కోరుతారని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసినందుకా?, విద్యుత్ కమీషన్లు, విచ్చలవిడిగా నకిలీ మద్యం అమ్మకాలు చేసినందుకా?, నిరుద్యోగులను మోసం చేసినందుకా?, నవరత్నాల పేరుతో నవ మోసాలకు పాల్పడినందుకా అని ప్రశ్నించారు. జగన్ మళ్లీ జైలుకి వెళ్తేనే ప్రజలకు మేలు చేకూరుతుందని చెప్పారు. సమావేశంలో టిడిపి నాయకులు సింతు సుధాకర్, పి.ఎం.జె బాబు, రామారావు, రాములు తదితరులు పాల్గొన్నారు.

15న సామాజిక సాధికార యాత్ర

నరసన్నపేట : ఈనెల 15న నరసన్నపేటలో నిర్వహించే సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో బస్సుయాత్ర సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు చేసిన మంచిని చెప్పడానికి మంత్రులు, పార్టీ నాయకులు వస్తున్న కార్యక్రమానికి పెద్దఎత్తున జన సమీకరణ చేయాలన్నారు. బస్సుయాత్ర పోలాకి మండలం మబుగాం నుంచి ప్రారంభమై కిల్లాం, ఈదులవలస జంక్షన్ మీదుగా నరసన్నపేట పట్టణానికి చేరుకుంటుందన్నారు. అధిక సంఖ్యలో యువత హాజరై బైక్ ర్యాలీలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో వైసిపి బిసి సెల్ జోనల్ ఇన్‌ఛార్జి ధర్మాన కృష్ణచైతన్య, డిసిసిబి ఛైర్మన్ కె.రాజేశ్వరరావు, ఎంపిపిలు ఆరంగి మురళీధర్, ముద్దాడ బైరాగి నాయుడు, వాన గోపి, జెడ్‌పిటిసి చింతు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి బాణసంచా విక్రయాలు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బాణసంచా సామగ్రి విక్రయాలకు అనుమతులు పొందిన దుకాణదారులు విధిగా నిబంధనలు పాటించాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక స్పష్టం చేశారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద బాణసంచా విక్రయాల లైసెన్సు కలిగిన దుకాణాలను శుక్రవారం సాయంత్రం తనిఖీ చేసి, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. లైసెన్సు కలిగిన దుకాణాల్లో మాత్రమే బాణసంచాను విక్రయించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నిర్ణయించిన ప్రదేశాల్లో ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసుకొని విక్రయించాలన్నారు. షాపుల వద్ద నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. దుకాణాలకు దూరంగా వాహనాలు నిలుపుకునేలా చూసుకోవాలని సూచించారు. షాపుల మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలని, షాపు అవరణలో ధరల పట్టికను కచ్చితంగా ప్రదర్శించాలని సూచించారు. వ్యాపారులు భద్రతా ప్రమాణాలను తప్పక పాటించాలన్నారు. లైసెన్సులు లేకుండా ఎవరైనా మందుగుండు సామగ్రి తయారు చేసినా, నిల్వ చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌పి వెంట శ్రీకాకుళం డిఎస్‌పి వై.శృతి, రూరల్ సిఐ ఎల్.సన్యాసినాయుడు, రెండో పట్టణ ఎస్ఐ లక్ష్మణరావు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ఎచ్చెర్ల ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో నిర్వహించిన పోలీస్ పరేడ్ కార్యక్రమంలో సిబ్బంది సమర్పించిన గౌరవ వందనాన్ని ఎస్‌పి స్వీకరించారు. పరేడ్‌లో భాగంగా ప్లాటూన్ల వారీగా కవాతును పరిశీలించారు. అనంతరం జిల్లా సాయుధ దళాల పోలీసు సిబ్బంది, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సమస్యల పరిష్కారానికి ఎచ్చెర్ల హెడ్ క్వార్టర్స్‌లో గ్రీవెన్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు వై.శృతి, డి.ప్రసాదరావు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సాయుధ దళాల పోలీసులు పాల్గొన్నారు. హిరమండలం పోలీస్‌స్టేషన్‌ను ఎస్‌పి ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డుల నిర్వహణా తీరును పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు.



'చిరుమువ్వలు' బాలల సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాశక్తి దినపత్రిక ప్రచురించిన 'చిరుమువ్వలు' బాలల ప్రత్యేక సంచికను నగరంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.గోవిందరావు ఎం.వాగ్దేవి మాట్లాడుతూ దేశ ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఏటా నవంబరు 14న బాలల దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఆయన కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రధానిగా దేశాభివృద్ధికి బాటలు వేశారన్నారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి మాట్లాడుతూ బాలబాలికల్లో నిబిడీకృతమైన అభిరుచులు, నైపుణ్యాలు, సాహితీ స్పృహ, కళలపై ఆసక్తి, సామాజిక దృక్పథం తదితర సామర్థ్యాలను వెలికితీసేందుకు ప్రజాశక్తి ప్రచురించిన చిరుమువ్వలు ప్రత్యేక సంచిక తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు పి.రవికుమార్, పద్మావతి, తేజ, ఎం.మోహనరావు, ప్రజాశక్తి సర్క్యులేషన్ ఎగ్జిక్యూటివ్ బి.సింహాచలం, సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - ఆమదాలవలస



స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కాంతారావు

ప్రజలకు నాణ్యమైన పోషక విలువలతో కూడిన్న ఆహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. మండలంలోని మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండియు) వాహనాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఐ.జె నాయుడు కాలనీలోని అంగన్వాడీ కేంద్రం, రేషన్ డిపోను పరిశీలించారు. లక్ష్మీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఫోర్టిఫైడ్ బియ్యంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సాధారణ బియ్యంతో పోలిస్తే ఫోర్టిఫైడ్ బియ్యంలో ఐరన్, విటమిన్ ఎ, బి-12, ఫోలిక్ యాసిడ్ వంటి సూక్ష్మపోషకాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ బియ్యం తినడం వల్ల చిన్న పిల్లలు, గర్భిణుల్లో పోషకాల లోపాన్ని నివారించవచ్చని చెప్పారు. ఎవరైనా కార్డుదారుల వద్ద బియ్యం కొని బ్లాక్ మార్కెట్‌కి రవాణా చేసినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల అసిస్టెంట్ మేనేజర్ దామోదరరావు, బిసి సంక్షేమ సహాయాధికారి ఎల్.అప్పారావు, తూనికలు, కొలతల అధికారి శంకరరావు, పౌర సరఫరాల డిటి డి.అమర్నాథ్, ఎంఇఒ-2 టింగరాజు, ఐసిడిఎస్ పిఒ గీతశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనుల్లో పురోగతి చూపాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమగ్ర భూ రీ సర్వే పనుల్లో పురోగతి చూపాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి ఆర్‌డిఒలు, తహశీల్దార్లతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 132 చోట్ల చేపడుతున్న రీ సర్వే మూడో దశ పనుల పురోగతిపై శుక్రవారం సమీక్షించారు. ప్రస్తుతం చేపడుతున్న పనులకు సిబ్బంది కొరత లేదని, ప్రతిరోజూ ఇక్కో గ్రామంలో కనీసం 20 ఎకరాలకు తక్కువ కాకుండా క్షేత్రస్థాయిలో సర్వే పూర్తి కావాల్సిందేనని స్పష్టం చేశారు. మొబైల్ మెజిస్ట్రేట్ బృందం సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చూపాలని, లేదంటే అప్పీల్స్ పెరిగే అవకాశం ఉందన్నారు. క్షేత్రస్థాయి రెవెన్యూ సర్వే అధికారులు సమన్వయంతో పనిచేసి పురోగతి చూపాలని చెప్పారు. పనులు వేగవంతంగా చేసేందుకు సిబ్బంది కావాలంటే పక్క మండలాల నుంచి తీసుకోవాలని సూచించారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, పద్మావతి, ఆర్‌డిఒలు సిహెచ్.రంగయ్య, భరత్ నాయక్, సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ అర్.విజయ్ కుమార్, తహశీల్దార్లు తదితరులుహాజరయ్యారు.

కరువుపై నివేదికలు పంపండి

- వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రబీలో వరి వేయొద్దు
- సాగునీటి సమస్యలపై నివేదికను సిద్ధం చేయండి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

జిల్లాలో ఆలస్యంగా పంటలు వేసిన నేపథ్యంలో అక్టోబరు నెల వర్షపాతాన్ని పరిగణనలోకి తీసుకుని కరువు పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదికలు పంపాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన నీటిపారుదల, వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబరులో వర్షపాతం, పంటల సాగు, ఎండిపోతున్న పంటల వివరాలను ఉన్నతాధికారులకు పంపాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. తొలుత వ్యవసాయశాఖ జెడి శ్రీధర్ పంటల సాగు పరిస్థితిని వివరించారు. జిల్లాలో 15 మండలాల్లో 20,938 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు మాట్లాడుతూ జిల్లా వర్షాభావ పరిస్థితులు ఉండడంతో, శివారు భూములకు నీళ్లు ఇవ్వలేకపోయామని చెప్పారు. సాధారణంగా అక్టోబరులో వంశధారలో రెండు వేల నుంచి మూడు వేల క్యూసెక్కుల నీరు ప్రవహించే పరిస్థితి ఉండగా, ప్రస్తుతం 1200కు తగ్గిందన్నారు. వర్షాభావ పరిస్థితులు, గొట్టాబ్యారేజీలో నీళ్లు లేకపోవడంతో రిజర్వాయర్‌లో ఉన్నంత మేరకు నీటిని కుడి, ఎడమ కాలువలకు విడిచిపెట్టామని చెప్పారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ కాలువల ద్వారా నీరందించే పరిస్థితి లేనందున రబీలో వరి వేయొద్దని, రైతులకు చెప్పాలని, పత్రికా ప్రకటనల ద్వారా తెలియజేయాలని సూచించారు. రబీకి వరి కాకుండా వేరుశనగ, నువ్వులు, పెసలు, మినుములు, రాగి, కట్టే జనుము వంటి ఆరుతడి పంటలు వేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్‌బికెల్లో ప్రత్యేక వ్యవసాయ సలహా మండలి సమావేశాలు నిర్వహించి పరిస్థితులకు రైతులకు వివరించాలని చెప్పారు. జనవరికి 4,263 టన్నుల విత్తనాలు కూడా సిద్ధం చేసినట్లు తెలిపారు. రైతులకు ఈ విషయాలపై అవగాహన కల్పించేందుకు కరపత్రాలు ముద్రించాలని, ప్రసార మాధ్యమాల సహాయం తీసుకోవాలని సూచించారు. జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి సమస్యలపై ఒక నివేదిక రూపొందించాలని, నీటిపారుదలశాఖ ఉన్నతస్థాయి కమిటీ సమావేశంలో వీటిని చర్చించి పరిష్కారం కనుగొనవచ్చన్నారు.

జలవనరుల శాఖ ఎస్ఇ సుధాకరరావు మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టు ద్వారా 800 ఎకరాల వరకు ఖరీఫ్‌లో నీళ్లు ఇవ్వలేకపోయామన్నారు. నాగావళిలో ఇన్‌ఫ్లో ఏమీ లేదని, తోటపల్లి, మడ్డువలస ద్వారా నీటిని తీసుకుని సాగునీరందిస్తున్నామని చెప్పారు. రసాయనాలు చల్లడం ద్వారా గుర్రపుడెక్క తొలగించవచ్చని, వచ్చే ఖరీఫ్ సీజన్‌కు ముందే ఈ ప్రక్రియ చేపడితే బాగుంటుందని రాగోలు వ్యవసాయ పరిశోధన స్థానం వ్యవసాయ శాస్త్రవేత్త సత్యనారాయణ అన్నారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ కాలువల ద్వారా విడుదల చేస్తున్న నీరు రిజర్వాయర్లు, తాగునీటి అవసరాలకు వినియోగిస్తారని, ఇది మంచిది కాదన్నారు. దీనిపై ఒక అధ్యయనం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. సివిల్ సప్లై డిఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఏడాది 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ ధాన్యం రవాణా చేసే ప్రతి వాహనంలో జిపిఎస్ పరికరాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రైతుల నుంచి ధాన్యం తీసుకుని ఎఫ్‌టిఒ (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్) జనరేట్ చేసిన తర్వాత రైతులు ప్రభుత్వానికి ధాన్యం ఇచ్చినట్టేనని, 21 రోజుల్లో వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని స్పష్టం చేశారు. ధాన్యం నాణ్యతకు సంబంధించి ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలను సిబ్బంది కచ్చితంగా పాటించాలన్నారు. ఒత్తిళ్లకు లొంగి తప్పులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు సాగు చేసినంత ధాన్యమంతా కొనాలని లక్ష్యంగా పెట్టుకోవద్దని, తిండి గింజలు, ఇతర అవసరాలకు కొంత ఉంచుకుంటారని, వాటిని దృష్టిలో పెట్టుకుని కొనుగోలు చేయాలని సూచించారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ సాగునీరు, వర్షాల్లేక ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో పంటలు ఎండిపోయాయన్నారు. జిల్లాలో పంటల సాగు, కరువు పరిస్థితులపై ఒక నివేదిక తయారు చేసి ఇస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ శిమ్మ నేతాజీ, అగ్రి మిషన్ సభ్యులు గొండు రఘురాం, నీటిపారుదల సలహా మండలి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, నీటి పారుదల శాఖ అధికారులు, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటర్లుగా నమోదు కావాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

జిల్లాలో 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్లుగా చేర్పించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. డిగ్రీ, పిజి కళాశాలల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి కొత్తగా ఓటర్ల నమోదు చేపట్టాలన్నారు. ఓటర్ల నమోదు, తొలగింపు, చేర్పులు, అభ్యంతరాలపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమీక్షించారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల తర్వాత జిల్లావ్యాప్తంగా అనేక ఫిర్యాదులు వచ్చాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. తుది ఓటర్ల జాబితా వచ్చే ఏడాది జనవరి ఐదో తేదీన ప్రచురిస్తామని, అప్పటికి ఓటర్ల జాబితా పూర్తిస్థాయిలో మదింపు చేపట్టాలన్నారు. బూత్ లెవల్ అధికారులతో తహశీల్దార్లు ఎప్పటికప్పుడు ముఖాముఖి సమావేశాలు నిర్వహించి, ఎక్కడా లోపాలకు తావు లేకుండా సమర్థవంతమైన ఓటర్ల జాబితాలను రూపొందించాలన్నారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో మరోసారి బూత్ లెవల్ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఇప్పట్నుంచే ఈ కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. 2024 ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 288 సెక్టోరియల్ అధికారుల నియామకాలు పూర్తయ్యాయని తెలిపారు. అదే స్థాయిలో పోలీసు అధికారుల నియామకం త్వరలో పూర్తవుతుందన్నారు. ఓట్ల తొలగింపు సమయంలో బూత్ లెవల్ ఏజెంట్ల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ జయదేవి, పద్మావతి, ఆర్‌డిఒలు సిహెచ్.రంగయ్య, భరత్ నాయక్, తహశీల్దార్లు, కలెక్టరేట్ ఎఒ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

అభివృద్ధిలో దేశానికే ఆదర్శం

ప్రజాశక్తి- బూర్జ

అభివృద్ధిలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్న లంకాం గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలను ఇప్పటికే 99శాతం అమలు చేయడమే కాకుండా ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా గడప వద్దకే పాలన అందించడం గర్వించదగ్గ విషయమన్నారు. నిరుద్యోగ సమస్యను అధిగమించేందుకు వీలుగా ఉద్యోగాలను కల్పించామన్నారు. అలాగే రైతు భరోసా, అమ్మఒడి తదితర పథకాలు ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏమైనా సమస్య ఉంటే వాటి పరిష్కారం కోసం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పాఠశాల మధ్యాహ్న భోజన పథకం వంటపాత్రలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెజ్జిపురం రామారావు, మండల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర టిట్కో డైరెక్టర్ గోవిందరావు, వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమ్మ నాయుడు పాల్గొన్నారు.


ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న దుర్గారావు

రిజర్వాయర్ పూర్తి చేయరా?

ప్రజాశక్తి- పలాస


పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం, మెళియాపుట్టి మండలాలకు సాగునీరు, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీకి తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణానికి తలపెట్టి పుష్కర సమయం దాటిపోయినా ఇప్పటికీ ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ఎందుకు పూర్తి చేయడం లేదని జనసేన నాయకులు డాక్టర్ వి.దుర్గారావు ప్రశ్నించారు. మండలంలోని రేగులపాడు, నందిగాం మండలం బడగాం సమీపంలో జరుగుతున్న ఆఫ్‌షోర్ రిజర్వాయర్ కుడికాలువ హెడ్ రెగ్యులేటర్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల పొలాలకు నష్టపరిహారం పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడంతో కుడికాలువ తవ్వకాలను రైతులు అడ్డుకున్నారని, కేవలం 2 కిలోమీటర్లు తవ్వారన్నారు. గత మే, జూన్ నెలల్లో జరిగిన మట్టి పనులకు ఇంతవరకు బిల్లు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ ప్రధాన రిజర్వాయర్ బండ్ నిర్మాణ పనులు నిలిపివేశారన్నారు. ఇంతవరకు ఎడమ కాలువ కోసం భూసేకరణగాని, డిజైన్ ఎందుకు రూపొందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఆఫ్‌షోర్‌పై దృష్టి సారించక పోవడం వల్లే రిజర్వాయర్ పనులు ఎక్కడకక్కడే నిలిచిపోయాయన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది

క్రీడాకారిణులకు అభినందన

ప్రజాశక్తి- పలాస

నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఇటీవల నెల్లూరు స్కూల్సగేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన క్రీడల్లో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో శ్రీవిద్యావాహిని జూనియర్ కళాశాలలో ప్రధమ సంవత్సరం చదువుతున్న శిష్ట ప్రియమణి, జామి జోత్స్నలకు 19ఏళ్ల బాలికల విభాగంలో బాల్ బ్యాట్మింటైన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జిల్లా జట్టు తరుపున రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం కైవసం చేసుకొని జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు, ఎఒ పైల మన్మధరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబులతో పాటు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తిరుమలరావు మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహద పడతాయనిన్నారు. జాతీయస్థాయిలో కాశీబుగ్గకు మంచి పేరు తీసుకు వచ్చినందుకు అభినందించారు.


ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

రోగులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి- కవిటి

ఆస్పత్రికి వచ్చి డయాలసిస్ చేయించుకుంటున్న రోగులపై ప్రత్యేకశ్రద్ధ వహించి వారికి సరైన సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే బెందాలం అశోక్ అన్నారు. శుక్రవారం సిహెచ్‌సి అభివృద్ధి కమిటీ సమావేశం సూపరింటిండెంట్ డాక్టర్ రాంజీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డయాలసిస్ రోగులకు అవసరమైన కుర్చీలు ఏర్పాటు చేయడమే కాకుండా, డయాలసిస్ యూనిట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అదే విధంగా ఆస్పత్రికి నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా ఇన్వర్టర్, జనరేటర్ వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. వైద్యులు సమయానికి రోగులకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని కోరారు. ముఖ్యంగా స్త్రీ వైద్య నిపుణులు లేకపోవడంతో చాలామంది మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజల అవసరాలు గుర్తించి ఆస్పత్రిలో స్త్రీ వైద్య నిపుణులను నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, ఇఒ వీరభద్ర స్వామి, వైద్యులు సతీష్, సాయి ప్రసన్న కుమార్, వాణి, అభివృద్ధి కమిటీ సభ్యులు ఆరింగి రాజు, నాగేశ్వరరావు, సురేష్, రంగారావు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

ఇచ్ఛాపురం : స్థానిక మండల విద్యా వనరుల కేంద్రానికి జుత్తు జగ్గన్న మెమోరియల్ ట్రస్ట్ విశాఖపట్నం ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందించారని విద్యాశాఖాధికారి అప్పారావు తెలిపారు. ఈ పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలానికి తెలుగు మీడియం-105, ఆంగ్లమాధ్యమం-67, ఇతర మాధ్యమం 31 పుస్తకాలు చేరాయి. వీటిని మండలంలోని 16 ఉన్నత పాఠశాలలకు అందిస్తామని ఎంఇఒ అప్పారావు తెలిపారు. ట్రస్ట్ అధ్యక్షులు జుత్తు సింహాచలం, ఉపాధ్యక్షులు శశిభూషన్, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి


లావేరు : జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ప్రజాశక్తి- లావేరు

రాష్ట్రంలో మళ్లీ సిఎంగా జగన్మోహన్ రెడ్డి వస్తేనే సంక్షేమం, అభివృద్ధి ఉంటుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు, ప్రజాప్రతినిధులతో జెండాలు పట్టుకుని ర్యాలీ నిర్వహించి మాట్లాడుతూ ఎపిలో జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టేక పాలనలో, పథకాలు అమల్లో, అభివృద్ధిలో దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజీనాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసురావు, గొర్లె అప్పలనాయుడు, లంకలపల్లి గోపి, ఉప సర్పంచ్ పైడి దాము, నారాయణరావు, షేఖ్ ఖాన్ బాషా పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మెళియాపుట్టి గ్రామ సచివాలయంలో స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో శుక్రవారం ఎపికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంపిపి ప్రతినిధి బైపోతు ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లాన బాలరాజు, మండల పార్టీ కన్వీనర్ పల్లి యోగి, స్థానిక సర్పంచ్ సలాన అప్పలనాయుడు, ఎంపిటిసి సలాన చిట్టి బాబు, శ్రీనివాసరావు, పలువురు సర్పంచ్‌లు, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంత బొమ్మాళి: గోవింద పురంలో ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం సర్పంచ్ రెయ్య రామిరెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, డైరెక్టర్ మార్పు నాగభూషణరావు, మండల పార్టీ అధ్యక్షుడు జీరు బాబూ రావు, నాయకులు బుడ్డా మోహన్ రెడ్డి, రెయ్య ప్రసాద్ రెడ్డి, పల్లి రామారావు, శ్రీరంగం వీరా స్వామి, చింతల రాజులు, ఎంపిడిఒ ప్రేమ లీల, ఇఒపిఆర్‌డి గోపాలరావు, పంచాయతీ కార్యదర్శి ఢిల్లేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు జోగు రాములమ్మ పాల్గొన్నారు.

కవిటి: మండలం బెజ్జిపుట్టుగ గ్రామంలో జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, ఎఎంసి వైస్ చైర్మన్ వై. నీలయ్య, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, సర్పంచ్‌లు నారాయణ స్వామి, భద్రాచలం, బి.ప్రకాష్, ఎం.లచ్చయ్య, నాయకులు ఎన్ని అశోక్, జల్లు యుగంధర్, ప్రవీణ్ పాల్గొన్నారు.



సంతబొమ్మాళి : సమావేశంలో మాట్లాడుతున్న కృపారాణి

సోంపేట: మండలంలోని బెంకిలి సచివాలయం పరిధిలో ఎంఎల్ఒ గండుపల్లి సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఎపికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఎంఎల్ఒ సోమేశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి పిరియా ధర్మేంద్ర, సచివాలయ కన్వీనర్లు కోట రాజు, తట్ట షణ్ముఖరావు, గృహసారధులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో మరింత మేలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ గెలిపిస్తే ప్రజలకు మరింత మేలు చేసే కార్యక్రమాలు చేపడతారని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని పెద్దపాడులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్ల పాలన తర్వాత ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవాలన్న ఆయన ఆలోచన మేలు కోరేదిగా ఉందన్నారు. 2014 ఎన్నికల సమయంలో ఓటు వేసి గెలిపిస్తే చంద్రబాబు ప్రజలకు మోసం చేశారని అబద్ధాలతో తిరిగి ముఖ్యమంత్రి కావాలని కలలు కంటున్నారన్నారు. ఎవరెన్ని చెప్పినా ప్రజల మనసుల్లో జగన్ చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. రూ.24 కోట్లతో పెద్దపాడుకు తాగునీరు అందించేందుకు పనులు ప్రారంభిస్తామన్నారు. 30 రకాల పనులతో పెద్దపాడును అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. చాపురం నుంచి వానవానిపేట వరకూ రూ.1.5 కోట్లతో రోడ్డు నిర్మాణం, రూ.10 లక్షలతో విద్యుత్ లైన్ ఏర్పాటు, తంగివానిపేటలో రూ.40 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ చల్లా ఓబులేసు, ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


గడప గడపకు కార్యక్రమంలో పర్యటిస్తున్న మంత్రి ధర్మాన

సిఎం దృష్టికి జీడి సమస్యలు తీసుకెళ్తాం

ప్రజాశక్తి- పలాస

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల 23న పలాస వస్తున్న సందర్భంగా జీడి రైతుల సమస్యలు, జీడి గిట్టుబాటు ధర కల్పించాలని సిఎం దష్టికి తీసుకువెళ్లేందుకు జీడీ రైతులు సిద్ధం కావాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు, జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. కాశీబుగ్గ సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జీడిరైతు సంఘం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి పిక్కలు 80 కేజీల బస్తా రూ.16వేలు ధర నిర్ణయించి ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పలాస కేంద్రంగా జీడి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కేరళ తరహాలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక పిక్కలు కొనుగోలు చేసిన తరువాతనే విదేశీ పిక్కలు దిగుమతికి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లక్ష సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించడానికి సిద్ధం కావాలన్నారు. సమావేశంలో జీడి రైతుల సంఘం నాయకులు వినోద్ కుమార్, బి. లక్ష్మీనారాయణ, యంపల్ల జోగారావు, సిఐటియు నాయకులు యన్.గణపతి పాల్గొన్నారు.

కొనుగోళ్లలో ఇబ్బంది లేకుండా చూడాలి


ప్రజాశక్తి- నందిగాం

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎంపిపి నడుపూరు శ్రీరామమూర్తి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు శ్యామసుందరరావు అధ్యక్షతన వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్ వర్మ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఎంపిపి పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం మండలంలో పలు పంచాయతీల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల పంటకు తీవ్ర నష్టం వాటిల్లి నాశనమైందన్నారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై కట్టెజనుము విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణరావు, ఎంపిడిఒ శివప్రసాద్, సర్పంచ్ ఎర్రన్న, పశు వైద్యశాఖధికారి, వ్యవసాయ శాఖ సిబ్బంది, వ్యవసాయ సలహా మండల సభ్యులు పాల్గొన్నారు.

'ఎపి హేట్స్ జగన్'

ప్రజాశక్తి- నరసన్నపేట

ఎపి హేట్స్ జగన్ అని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సారవకోట, అడ్డపనస పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నవరత్నాలు పేరు చెప్పి నవమోసాలు చేస్తున్న జగన్ ఎందుకు మళ్లీ రాష్టానికి కావాలి అన్నారు. నాసిరకం మద్యం పోసి రూ. 35లక్షల మందిని రోగాల బారిన పడేసినందుకు జగన్ రావాలా, ఉచిత విధానం రద్దు చేసి నాలుగు రెట్లు ఇసుక రేట్లు పెంచి భవన నిర్మాణ రంగాన్ని కుప్పకూల్చి, 125 వృత్తులు, వ్యాపారాలు దెబ్బతీసినందుకు జగన్ రావాలా అని ప్రశ్నించారు. ప్రశ్నించిన పౌరులు, మీడియా, ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు నిత్యకృతమయ్యాయన్నారు. సమావేశంలో రాష్ట్ర బిసి కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్, మండలపార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, ఐటిడిపి కన్వీనర్ సురవరపు తిరుపతిరావు, సర్పంచ్ హేమంత్, పొన్నాన శంకరరావు, సారవకోట రామారావు, నిక్కు జనార్దన్, తెలుగు యువత అధ్యక్షులు పిల్ల నంద కిషోర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తి

ఇంటింటికీ తాగునీరు అందించడమే ధ్యేయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించేందుకే జలజీవన్ పథకం ముఖ్య ఉద్దేశమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తవలస గ్రామంలో రూ.95 లక్షలతో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా వాటర్ ట్యాంక్, పైప్ లైన్లు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సరుబుజ్జిలి మండలం చిగురువలస మరియు వెన్నెల వలస గ్రామాల్లో సుమారు రూ.కోటి 13 లక్షల నిధులతో జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కొళాయిల కార్యక్రమానికి శంకుస్థాపన చేశారు. చిగురువలస గ్రామంలో సుమారు రూ.9 లక్షలతో 200 మీటర్ల పనులు పూర్తి చేసిన సిసి రోడ్డుకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదప్రజల అభ్యున్నతే ధ్యేయంగా సిఎం జగన్మోహన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కెవిజి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, వైస్ ఎంపిపి శివానంద బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ బెవర కృష్ణవేణి, సర్పంచ్ గుండెల సింహచలం, ఎంపిటిసి సూర్యప్రకాష్, వైసిపి నాయకులు రవికాంత్, అప్పారావు, సవర మిన్నరావు పాల్గొన్నారు.


జల జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ సీతారాం

కిడ్నీ రోగులకు పరిశోధనా కేంద్రం వరం

పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పద్మనాభపురం వద్ద నిర్మిస్తున్న 200 పడకల ఆస్పత్రితో పాటు కిడ్నీ పరిశోధన కేంద్రం కిడ్నీ రోగులకు వరమని పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. శుక్రవారం కిడ్నీ ఆసుపత్రికి వెళ్లే మార్గానికి రహదారి నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంట పట్టణాల్లో చారిత్రాత్మగా ఈ నెల 23వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి చేతులమీదుగా ప్రారంభం కాబోతున్న ఆసుపత్రికి రహదారి పనులకు భూమిపూజ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్, డిఇ సునీల్ కుమార్, ఎఇ అవినాష్, వైస్‌చైర్మన్లు బొర కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు వైసిపి నాయకులు సనపల సింహాచలం, భవానీ, బడగల బల్లయ్య, పి.ప్రసాద్, దుర్గాశంకర్ పండా, గౌరీ పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చైర్మన్ గిరిబాబు

వైసిపి ప్రభుత్వాన్ని అసహ్యించుకుంటున్న ప్రజలు

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వంలో సిఎం జగన్మోహనరెడ్డి పాలనను ప్రజలు అసహ్యించుకుంటున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషా అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ధరలు, పన్నులు, చార్జీలు, అప్పుల బాధుడుతో వైసిపి పాలనలో ఒక్కొక్క కుటుంబంపై ప్రభుత్వం మోపిన అదనపు భారం రూ.8,25,549 లక్షలని, విద్యుత్ చార్జీలు పెంచి పేదల నెత్తిపై రూ.57వేల కోట్ల భారం మోపారని, అయినా కరెంట్ కోతలు ఆగలేదన్నారు. బినామీలకు రూ.2.2 లక్షల కోట్ల విద్యుత్ కాంట్రాక్టర్లు జగన్మోహనరెడ్డి అప్పనంగా అప్పగించారని, స్మార్ట్ మీటర్లు, విద్యుత్ పరికరాల కొనుగోళ్లల్లో రూ.15 వేల కోట్లు కమిషన్ రూపంలో తాడేపల్లి ప్యాలెస్ కొట్టేసిందని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు, జైల నిర్బంధాలు నిత్యకత్యామయ్యాయని, త్వరలో జరిగే ఎన్నికల్లో వైసిపికి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

14న పెన్షనర్ల గ్రీవెన్స్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పెన్షనర్లకు ఎలాంటి సమస్య ఉన్నా తక్షణమే పరిష్కరించేందుకు వీలుగా ప్రభుత్వ ఆదేశానుసారం ఈనెల 14న ప్రత్యేక గ్రీవెన్సు స్వీకరించేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖజానాశాఖాధికారి సిహెచ్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేటులోని జిల్లా ఖజానాశాఖ కార్యాలయంలో పెన్షనర్ల స:ఘాల ప్రతినిధులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు వ్యక్తిగతంగా గాని, శాఖా పరంగా సామూహికంగా ఎలాంటి సమస్య ఉన్నా నేరుగా తనకు ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ఎక్కడైనా ఖజానాశాఖ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగుల నుంచి సమస్య ఉన్నా వాటిని సైతం పరిష్కరించుకునేందుకు వీలుందన్నారు. ఈసమావేశంలో ఎపి రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్, ఆల్ పెన్షనర్సు అసోషియేషన్ , ఉపాధ్యాయ పెన్షనర్ల తరపున పలువురు ప్రతినిధులు హాజరై సమస్యలపై చర్చించారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీడీ రవికుమార్

సమస్యలు తెలుసుకునేందుకే పల్లెనిద్ర

కోటబొమ్మాళి: క్షేత్ర స్థాయిలో ప్రజలు పడుతున్న బాధలను, పరిస్థితులను స్వయంగా పరిశీలించి అక్కడకక్కడే పరిష్కరించేందుకే సిఎం జగన్మోహన్‌రెడ్డి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారని మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి అన్నారు. శుక్రవారం కొత్తపేట పంచాయతీలో మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు అధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమంలో అమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకోవడం, పరిష్కారానికి కృషి చేయడంలో ఎప్పుడు ముందుండే సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. స్థానిక ఎంపిపి రోణంకి ఉమా మల్లేశ్వరావు, రాష్ట్ర కళింగకర్పోరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరాజు, సర్పంచ్ రామపాత్రుని ముఖందరెడ్డి సావిత్రితో కలిసి పార్టీ జెండాను, సంక్షేమ పథకాల బోర్డును అవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారామకృష్ణ, జెసిఎస్ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, వైసిపి నాయకులు కవిటి రామరాజు, కాళ్ల సంజీవరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృపారాణి

అత్తామామలే కడతేర్చారు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

మండలంలో కేసూపురం పంచాయతీలో నీలపు పుట్టుక గ్రామానికి చెందిన వివాహిత అనుమానాస్పద కేసులో అత్తమామలు కాల హంతకులుగా మారి కోడలిని చంపినట్లు నేరం అంగీకరించారు. మండలంలో తీవ్ర సంచలనం సృష్టించిన ఆత్మహత్య కేసులో వీడిన మిస్టరీపై సీఐ ఈశ్వర్ చంద్ర ప్రసాద్ విలేకరుల సమావేశంలో వివరించారు. మృతురాలు నీలాపు మీనాకుమారి (24) భర్త నీలాపు మోహనరావు ఉపాధి రీత్యా పోలెండ్‌లో వుంటున్నాడు. 2019లో వివాహం జరిగింది. నలుగురు సంతానం అక్టోబర్ 7 రాత్రి ఆమె కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడిందని 8న ఆమె తల్లి పైల మోహిని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా రూరల్ ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేశారు. ఈనెల 8న విషయం బయట పడుతుందన్న భయంతో అత్తమామలు నీలాపు అన్నపూర్ణ, నీలాపు జగ్గారావులు తామే హత్య చేసినట్లు విఆర్ఒ శంకరరావు ఎదుట నేరం అంగీకరించినట్లు సిఐ తెలిపారు. విఆర్ఒ ఫిర్యాదు మేరకు కేసును ఇన్‌ఛార్జి ఎస్ఐ కె.గోవిందరావు మార్పు చేసినట్లు తెలిపారు. నిందితులు జగ్గారావు ఆమెను ఎడమ చేతితో గోడకు నెట్టి, కుడి చేతితో గొంతు నులిమి చంపినట్లు, ఆ సమయంలో అత్త అన్నపూర్ణ కదలకుండా కాలిపై కర్చున్నట్లు తమ విచారణలో అంగీకరించారని తెలిపారు. అనంతరం వారి సమీప బంధువు నీలాపు హేమరాజు సహకారంతో ఆమె ధరించిన బట్టలు తొలగించి నైటీ వేసి సాక్ష్యాలను తారుమారు చేసే ప్రయత్నం చేశారని సిఐ వివరించారు. ఈ ముగ్గురిపై ఇప్పటికే హత్యకేసు నమోదు చేయగా, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న సిఐ ఈశ్వరచంద్ర ప్రసాద్

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి- పలాస

బాల్య వివాహాలు చేయడం నేరమని, వాటిని ప్రోత్సహించిన వారు కూడా శిక్షార్హులని జూనియర్ సివిల్ జడ్జి చక్రవర్తి మల్లా అన్నారు. శుక్రవారం బార్ అసోసియేషన్, మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో చినబాడాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాల మధ్య తేడాలను విద్యార్థులకు వివరించారు. చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం వలన అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి జిఎంఎస్ అనిల్‌రాజు, ఉపాధ్యక్షులు ఫైయాజ్ అహ్మద్ (ఘని), వి.రవికుమార్, బి.కామేశ్వర పట్నాయిక్, కోత రజనీకుమార్, కోర్టు సూపరింటిండెంట్ పాణిగ్రాహి, కోర్టు సిబ్బంది గోవింద్, సంజీవరావు, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, ఉమామహేశ్వరరావు, రెడ్డి కృష్ణమూర్తి, గోవిందరాజులు పాల్గొన్నారు.

తోటలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- పొందూరు

ప్రభుత్వ అటవీ భూముల్లో జీడితోటలను అక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డిఆర్ఒ అప్పలనాయుడు పేర్కొన్నారు. మండలం తండ్యాం పంచాయతీ, లావేరు మండలం కొత్తకుంకాం పరిధిలో కొండపై జీడితోటలను పరిశీలించారు. జీడితోటలు ఆక్రమణలపై గ్రామానికి చెందిన గున్నా ఈశ్వరరావు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంపై డిఎఫ్ఒ ఆదేశాలు మేరకు కొండపై జీడితోటలను పరిశీలించి, ఆక్రమణలను గుర్తించారు. ఈ సందర్భంగా పట్టాలు లేకుండా ఆక్రమించిన జీడితోటలను గుర్తించి పంచాయతీలకు అప్పగించారు. ఇకపై ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చిరించారు. ఈయనతో పాటు ఎఫ్‌బిఒ శ్రీనివాస్, సర్పంచ్ ప్రతినిధి కె.భాస్కరరావు ఉన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజాశక్తి- టెక్కలి

తీవ్ర వర్షాభావ పరిస్థితులు కారణంగా ఖరీఫ్‌లో వరిపంట చివరి దశలో ఎండిపోయిన కారణంగా టెక్కలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు బగాది శేషగిరిరావు డిమాండ్ చేశారు. శుక్రవారం టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టి కార్యాలయ ఎఒ రాజగోపాలరావుకు వినతిపత్రం అందించారు. వర్షాలు లేకపోవడం, వంశధార ఆయకట్టు నీరు ఎగువ ప్రాంతాలకు వెల్లకపోవడం, మెట్ట ప్రాంతాలకు చెందిన వ్యవసాయం రైతు చేతికి వచ్చే సమయంలో ఎండిపోయిన కారణంగా రైతాంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోన్నారన్నారు. వినతిపత్రం అందించిన వారిలో టిడిపి ఆధ్యక్షులు బగాది శేషగిరితో పాటు మహిళా మండల పార్టీ ఆధ్యక్షురాలు మెండ దమయంతి, సీనియర్ నాయకులు హనుమంతు రామకృష్ణ, చాపర గణపతి, పోలాకి షణ్ముకరావు, మామిడి రాము, మట్ట పురుషోత్తం, కోళ్ల లవకుమార్, రెయ్యి ప్రీతీష్ చంద్, దల్లి ప్రసాద్‌రెడ్డి, గండి చంద్రరావు, సోడిమూడి కిరణ్‌కుమార్, కోళ్ల కామేష్, మల్లిపెద్ది మధు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలో పొడుగుపాడు గ్రామానికి చెందిన మెట్ట మాధవరావు (43) ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి మండల వైసిపి అధ్యక్షులు నూక సత్యరాజు ఆధ్వర్యంలో గ్రామపెద్దలు శుక్రవారం రూ.లక్షా 34 వేలు ఆర్థికసాయం అందజేశారు. సహాయాన్ని స్థానిక సర్పంచ్ నూక సత్యరాజు, డాక్టర్. మెట్ట పాపారావు, మెట్ట రామారావుతో పాటు గ్రామంలో ఉన్న ఉద్యోగులు, యువకులు, పెద్దలు అందరూ కలిసి మృతుడు భార్యకు అందించారు. కార్యక్రమంలో సింగూరు వాసు, అన్నెపు భాస్కరరావు, మెట్ట గడ్డయ్య, చిన్నప్ప, ఎండ మురళి, మెట్ట తులసిరావు, రమేష్, గ్రామస్తులు ఉన్నారు.

జవాన్‌కు అంత్యక్రియలు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలో విజయరాంపురం గ్రామానికి చెందిన సిఆర్‌పిఎఫ్ జవాన్ నూక సింహాద్రి నాయుడు (32) అంత్యక్రియలు శుక్రవారం అధికార లాంచనాలతో నిర్వహించారు. విధి నిర్వహణలో భాగంగా ఢిల్లీలో విధులు నిర్వహిస్తున్న సింహాద్రినాయుడు మంగళవారం హఠాన్మరణం చెందారు. సింహాద్రి నాయుడు మృతి చెందిన విషయాన్ని ఢిల్లీ సిఆర్‌పిఎఫ్ పోలీసు విభాగ అధికారులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జవాన్ మృతదేహాన్ని శుక్రవారం తెల్లవారుజామున విశాఖపట్నం సిఆర్‌పిఎఫ్ బలగాలు మృతుని స్వగ్రామానికి తీసుకువచ్చారు. మృతదేహం స్వగ్రామానికి చేరుకోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. శుక్రవారం ఉదయం స్థానిక ఎస్ఐ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్య భారతితో పాటు తండ్రి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి- జి.సిగడాం

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కిమిడి కళా వెంకటరావు అన్నారు. శుక్రవారం మండల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో వేగవంతం చేయాలన్నారు. రానున్న ఎన్నికలకు ఎంతో సమయం లేదని, ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. నాయకులు, కార్యకర్తలు తమవంతు భాద్యత వహించి మళ్లీ టిడిపిని అధికారంలోకి తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు కుమరాపు రవికుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జి టంకాల మౌళీశ్వరరావు, కూనుబిల్లి కుర్మారావు, పంచిరెడ్డి బంగారు నాయుడు, పైల రామకృష్ణ నాయుడు, బుజ్జి, సూరన్నాయుడు, పంచిరెడ్డి శ్యామలరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కళావెంకటరావు

కరువు జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో వర్షాభావ పరిస్థితి వల్ల కరువు కోరల్లో చిక్కుకున్న బాధిత రైతాంగానికి ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. నగరంలోని క్రాంతి భవనంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచే తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు తెచ్చి మదుపులు పెట్టిన రైతాంగానికి ఎండుతున్న పంటలు చూసి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారని తెలిపారు. సాగునీరు అందించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. పంటల బీమా పథకాన్ని అమలు చేసి, బ్యాంకులు ఇచ్చిన పంట రుణాలు రద్దు చేయాలని, ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.


దిశ యాప్ డౌన్‌లోడ్ చేసిన విద్యార్థినిలు

దిశ యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రతి విద్యార్థిని మొబైల్ ఫోన్‌లో దిశయాప్ డౌన్‌లోడ్ చేసి ఉండాలని సిఐ బి.ప్రసాదరావు సూచించారు. శుక్రువారం స్థానిక ఎల్‌విఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థినిలకు దిశయాప్‌పై అవగాహన కల్పించారు. అలాగే దిశయాప్ ఉండడం వలన కలిగే ఉపయోగాలు వివరించారు. అందరి మొబైల్ ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసారావు, పోలీసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎఎస్ఐ కూర్మారావు

మాదకద్రవ్యాలు అత్యంత ప్రమాదకరం

ప్రజాశక్తి- కవిటి

మాదకద్రవ్యాలు అత్యంత ప్రమాదకరమని, విద్యార్థులు వీటికి బానిసలు కాకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఎఎస్ఐ కూర్మారావు సూచించారు. మాదక దవ్యాలు దుష్ఫలితాలు అనే అంశంపై శుక్రవారం ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కుర్మారావు మాట్లాడుతూ మండలంలోని ప్రతీ పాఠశాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి విద్యార్థులను చైతన్య పర్చాలని సూచించారు. ముఖ్యంగా యుక్త వయసులో ఉన్నవారిపై వీటి ప్రభావం అధికంగా ఉంటుందని, గంజాయి, గుట్కా వంటివి పాఠశాల పరిసరాలలో విక్రయిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ ధనుంజయ, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు దంత పరీక్షలు వైద్యులు

విద్యార్థులకు దంత పరీక్షలు

ప్రజాశక్తి- పొందూరు

మండలం కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్రీకాకుళంకు చెందిన సంపత్ వినాయక సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీనివాస్ సుమారు 200 మంది విద్యార్థులకు దంతపరీక్షలను జరిపి మందులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సునీత, ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్‌వి రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నోడల్ ఆఫీసర్‌గా భాస్కరరావు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ పాఠశాలల్లో 4 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బైజూస్ ద్వారా విద్యను అందించే పథకానికి పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బైజూస్ జిల్లా నోడల్ అధికారిగా గురుగుబెల్లి భాస్కరరావును నియమించారు. ఈమేరకు డిఇఒ కె.వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. హొంజరాం ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఆయన పనిచేస్తున్నారు.

వసంతరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- నౌపడ

మండలం హనుమంతు నాయుడుపేట వైసిపి కార్యాలయంలో జెడ్‌పిటిసి పాల వసంత రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం వైసిపి నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించారు. వసంత రెడ్డి అభిమానులు, నాయకుల మధ్య కేక్ కటింగ్ చేశారు. అనంతరం స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు జీరు బాబురావు, వైసిపి నాయకులు నక్క భీమారావు, మోహన్‌రెడ్డి, పిలక రవికుమార్ రెడ్డి, రాములమ్మ, పాల మహేష్, మధుసూదనరావు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని మేధా హైస్కూల్ కరస్పాండెంట్ సోమేశ్వరరావు, గురుకుల విద్యాలయం కరస్పాండెంట్ అశోకవర్ధన్ అన్నారు. శుక్రవారం సాయిశిరిషా డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు ఇదే సరైన సమయమని, డిగ్రీ చదువులను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి విద్యార్థి చదువుపై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల డైరెక్టర్ శాంతారావు. చంద్రశేఖర్ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి- పలాస

విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని డాక్టర్ కూన మోహన్‌బాబు అన్నారు. మండలం రెంటికోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న డాక్టర్ గున్ను ప్రశాంతి ఉన్నత చదువులు నిమిత్తం వెళ్తున్న సందర్భంగా ప్రశాంతికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ సాతుపల్లి హేమ సుందర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి. సునీల్ కుమార్, డాక్టర్ సతీష్, సుభాష్, డాక్టర్ కూన పవన్ కుమార్ డాక్టర్ అశ్విని, డాక్టర్ అంజలి, డాక్టర్ లక్ష్మీనారాయణ, మెండ కృష్ణ, రిషికేశ్వరరావు, గోపాలరావు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు ఏకాగ్రత కీలకం

నరసన్నపేట : లక్ష్య సాధనలో ఏకాగ్రతే ముఖ్యమని, దీనివల్ల ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు జెట్టీ దొంతల తెలిపారు. పద్మావతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విషయం నేర్చుకోవడం, దానిని పదే పదే మననం చేసుకొని తద్వారా మేధాశక్తికి మరింత పదునుపెట్టడం వంటి అంశాలను విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు


ఆమదాలవలస : సైన్స్ విశిష్టతను వివరిస్తున్న మోహనరావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైన్స్‌పై నమ్మకమే ప్రపంచ సైన్స్ దినోత్సవ ధ్యేయమని జనవిజ్ఞాన వేదిక నాయకులు బొడ్డేపల్లి మోహనరావు, జనార్ధనరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని లక్ష్మీ నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది విద్యార్థులకు సైన్స్ టాలెంట్ 'చెకుముకి' పరీక్ష నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గడచిన 20 ఏళ్లుగా ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో నవంబర్ 10న ప్రపంచ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. సైన్స్ పట్ల నమ్మకం పెంచాలనే లక్ష్యంతో జనవిజ్ఞాన వేదిక ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ ఈ నెల 7 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు సైన్స్ ప్రచార ఉద్యమాన్ని నడుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డేపల్లి రామకృష్ణ, ఉపాధ్యాయులు విద్యాసాగర్, మెండ శ్యామలరావు, కె.సురేష్ కుమార్, బి.శ్యామ్ సుందరరావు, జనవిజ్ఞాన వేదిక నాయకులు హెచ్‌వి. సత్యనారాయణ, షణ్ముఖరావు పాల్గొన్నారు.

నౌపడ: మండలం దండు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ సైన్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు చెకుముకి పరీక్ష నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు ఆధ్వర్యంలో 98 మంది విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. హెచ్‌ఎం కోత చైతన్య, ఉపాధ్యాయులు వీరభద్రరావు, ఆదికేశవరెడ్డి, లక్ష్మి, భాస్కరరావు, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: సైన్స్‌పై విద్యార్థులు అభిరుచి పెంచుకొని


నౌపడ : చెకుముకి పరీక్ష రాస్తున్న విద్యార్థులు

శాస్త్రవేత్తలుగా తయారవ్వాలని మండల విద్యా శాఖ అధికారి జె.చిన్న వాడు అన్నారు. శుక్ర వారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ సైన్స్ దినోత్సవం సందర్భముగా చెకుముకి సైన్స్ ప్రతిభ పరీక్ష నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు మాట్లాడుతూ నిత్యజీవితంలో ఎదురైన సమస్యలకు సైన్స్ పరిష్కారాలు కనుగొంటుందన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు బి.వెంకటరమణ, మోహనరావు, బి.వెంకట్రావు, జోగారావు, జయరాం, డి.సుగుణవతి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


పలాస : ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టిసారించాలని తద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. చిట్టిబాబు అన్నారు. శుక్రవారం పాఠశాల క్రీడామైదానంలో గ్రిగ్స్ పోటీల్లో భాగంగా కబాడీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సర్వసాధారణమన్నారు. సీనియర్ బాలుర విభాగంలో కాశీబుగ్గ ఉన్నత పాఠశాల, బొడ్డపాడు, జూనియర్ విభాగంలో రంగోయి ఉన్నత పాఠశాల, కాశీబుగ్గ ఉన్నత పాఠశాల క్రీడాకారులు, సీనియర్ బాలికల విభాగంలో ఎంజెపి పలాస, బొడ్డపాడు హైస్కూల్ విద్యార్థినీలు, జూనియర్ బాలికల విభాగంలో రంగోయి, ఎంజెపి పలాస విజయం సాధించి జోన్ మీట్‌కు అర్హత సాధించారని రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంయుక్త కార్యదర్శి తవిటయ్య తెలిపారు. కార్యక్రమంలో జిల్లావ్యాయామ ఉపాధ్యాయ సంఘం సహాయ కార్యదర్శి సిహెచ్ పద్మలోచన, సంయుక్త కార్యదర్శి పైల గజేంద్ర, వ్యాయామ ఉపాధ్యాయులు శంకరరావు, ఆర్. శ్రీనివాసరావులు పాల్గొన్నారు. న్యాయనిర్ణీతలుగా సిహెచ్ రాంజీ, నారాయణ, ఎన్.నాగరాజు, హరి వ్యవహరించారు.

రణస్థలం రూరల్: క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని లంకపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.జయదేవి అన్నారు. 7, 8 తేదీల్లో మండల స్థాయి గ్రిగ్స్ పోటీల్లో ఖో ఖోలో సీనియర్ బాలికల విభాగంలో మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారిణిలను, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, రమణలను శుక్రవారం అభినందించి మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలు అవసరమన్నారు. క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. చిన్ననాటి నుంచే తమకు నచ్చిన క్రీడలో శిక్షణ పొందితే పోటీల్లో రాణిస్తారని తెలిపారు. క్రీడల కోటాలో ఉన్నత చదువులు, ఉద్యోగావకాశాలు పొందేందుకు ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, పి.రమణ, కెల్ల రమణ, మోహిని, కృప, సత్యనారాయణ, లక్ష్మణరావు, రాజు పాల్గొన్నారు.

టెక్కలి: మండలంలో చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వతరగతి చదువుతున్న రావాడ ప్రదీప్ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు ఎంపిక కాబడ్డారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.అనూరాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుంచి 13 వరకు విజయవాడ నగరం పడమటలో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థికి


రణస్థలం రూరల్ : విద్యార్థినులతో అధ్యాపక సిబ్బంది

వ్యాయామ ఉపాధ్యాయులు బాడాన నారాయణరావును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలతో పాటు ఉపాధ్యాయులు కురమాన దాలయ్య, పొట్నూరు జగదీష్, తమ్మినేని వైకుంఠరావు, కాపల నారాయణరావు, సిహెచ్ భారతి, సుధారాణి పలువురు అభినందించారు.

టెక్కలి :రాష్ట్ర స్కూల్‌గేమ్స్ పిలుపు మేరకు నిర్వహిస్తున్న టెక్కలి మండల గ్రిగ్స్ పోటీలు శుక్రవారంతో ముగిసాయి. ఉన్నత పాఠశాల మైదానంలో గడచిన రెండు రోజులుగా నిర్వహించిన పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి నాగభూషణం పర్యవేక్షించారు. శుక్రవారం సీనియర్స్ కబాడీ, ఖోఖో పోటీలు బాలికలకు నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాడాన నారాయణరావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పోటీలకు మండలంలో వివిధ పాఠశాలల నుంచి సుమారు 350 మంది విద్యార్దులు పాల్గొన్నారు. ఈ క్రీడల్లో వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణరాజా, కె.కె.రామిరెడ్డి, బి.ఆదిశేషు, జగ్గమ్మ, పాండవుల జగదీష్, ఆలివేణి, కాపల రఘునాధరావు పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి వేడుకలు

జి.సిగడాం :మండలం అద్దానంపేట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు కాలుష్య రహిత దీపావళి పండుగను జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులు కృష్ణుడు, సత్యభామ వేషధారణ, లక్ష్మీదేవి వేషధారణ అందరిని ఆకట్టుకున్నాయి. పిల్లలందరు వందల దీపాలను వెలిగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ కుమారి మాట్లాడుతూ దీపావళి అంటే దీపాల వరుసని మతంతో సంబంధం లేకుండా అందరూ కలసి ఆనందోత్సాహాలతో దీపావళి జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: శబ్దరహిత దీపావళిని జరుపుకుని శబ్ద కాలుష్యాన్ని నివారించాలని గూనానపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురుగుబెల్లి మధుబాబు కోరారు. మండలం గూనానపేటలో శుక్రవారం శబ్దరహిత దీపావళిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శబ్దకాలుష్యం నివారణపై ప్లకార్డులతో అవగాహన కల్పిస్తూ గ్రామంలో ర్యాలీని జరిపారు.

కవిటి: కల్యాణి ఆంగ్ల పాఠశాలలో శుక్రవారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో


జి.సిగడాం: దీపాల కాంతులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నరకాసుర వధ, సత్యభామ సాహసం తదితర అంశాలపై అవగాహన కల్పించి, విద్యార్థులతో బాణాసంచా కాల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బిందుమాధవి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి: టెక్కలి రవీంద్రభారతి పాఠశాలలో శుక్రవారం దీపావళి వేడుకలను నిర్వహించారు. హిందువుల పవిత్రమైన పర్వదినాల్లో దీపావళి ఒకటని చెడుపై మంచి సాధించిన విజయమని పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పలు కార్యక్రమాలను చేపట్టారు. డీన్ నాగరాజు పర్యవేక్షణలో నిర్వహించిన సంబరాల్లో దీపాల వరుసలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కవిటి: బాణసంచా కాలుస్తున్న విద్యార్థులు


టెక్కలి : ముందస్తు దీపావళిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

కరువు మండలంగా ప్రకటించాలి

ఇచ్ఛాపురం: తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కరువు మండలంగా ప్రకటించాల్సిన అవసరం ఉందని వ్యవసాయ సలహా సంఘ సమావేశంలో సభ్యులు అధికారులను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారి తిలక్ అధ్యక్షత వహించారు. కరువు మండలంగా ప్రకటించడానికి కావల్సిన అంశాలు, ఎండి పోయిన పంట విస్తీర్ణం సేకరించుట, రబీ పంటకు కావల్సిన విత్తనాలు ఇండెంట్ పెట్టడం తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో మండల చైర్మన్ నూకయ్య రెడ్డి, ఎంపిపి బొర పుష్ప, జెడ్‌పిటిసి ప్రతినిధి ఉప్పాడ రాజు, సభ్యులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు రాణించాలి

శ్రీకాకుళం అర్బన్ :మహిళలు అన్నింటా పురుషులతో సమానమే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఆర్ సన్యాసినాయుడు పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో జెండర్ ఈక్వాలిటీపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని హక్కులు పురుషులతో పాటు మహిళలకు కూడా సమానంగా ఉన్నాయని మహిళా సాధికారత పూర్తిస్థాయిలో అనుభవించడానికి మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని పిలుపు నిచ్చారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సురేఖ అధ్యాపకులు డాక్టర్ హరిత అరుణకుమారి ,న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్ ,మంత్రి వెంకటస్వామి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సన్యాసినాయుడు

పోలింగ్ కన్వీనర్లకు సూచనలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

వైసిపి సెంట్రల్ ఆఫీస్ సూచనల మేరకు పార్టీ పోలింగ్ కన్వీనర్లు పని చేయాల్సి ఉందని వైసీపీ ఇన్‌ఛార్జి పిరియా సాయిరాజ్ సూచించారు. స్థానిక మున్సిపల్ కల్యాణ మండపంలో శుక్రవారం మండల, పట్టణ పోలింగ్ కేంద్రాల కన్వీనర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం సాయిరాజ్ మాట్లాడుతూ మండల స్థాయి పోలింగ్ స్టేషన్ కన్వీనర్లు, నాయకులకు పార్టీ కార్యకలాపాలపై దిశా నిర్దేశం చేశారు.

కార్యక్రమంలో సీడ్ ఎపి చైర్మన్ శాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, రెడ్డిక కార్పోరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర రెడ్డి, ఎంపిపి బోర పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్, టౌన్‌పార్టీ అధ్యక్షులు బలివాడ ప్రకాష్ పట్నాయక్, కారంగి మోహనరావు పాల్గొన్నారు.

సక్రమంగా రికార్డుల నిర్వహణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

సంఘాల రికార్డులను సక్రమంగా నిర్వహించుకోవాలని ఎపిఎం కూర్మారావు సభ్యులకు సూచించారు. శుక్రవారం మండలంలో అక్కివరం పంచాయతీ మాసయ్యపేటలో సంఘాల రికార్డులను పరిశించి సభ్యులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ మహిళా స్వయం శక్తి సంఘాలు బ్యాంకులో దాచుకున్న డబ్బులకు, పొదుపుల నుంచి ఇచ్చుకున్న అప్పులు, తిరిగి వసూలు అయ్యి వచ్చిన వడ్డీలకు, ప్రభుత్వం నుంచి వచ్చిన వివిధ రకాల పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ ఇవి రమణ, విఒఎ రాజేశ్వరి, గ్రామ సంఘం అధ్యక్షులు రేణుక, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేత్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

నేత్రాలపై ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని సర్పంచ్ దున్న రత్నం బాలరాజు అన్నారు. శుక్రవారం అమలపాడు సచివాలయం వద్ద నిర్వహించిన కళ్లద్దాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళ్ల ఆవశ్యకతను వివరించారు. ఆకుకూరలు, పాలు వంటివి ఎక్కువగా తీసుకోవడం వల్ల కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని, దృష్టి లోపాన్ని నివారించుకోవచ్చని తెలిపారు. ఇటీవల ప్రతి గ్రామంలో కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన వారికి శాస్త్ర చికిత్సలతో పాటు కళ్లద్దాలు ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. 67మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా 44 మందికి కళ్లద్దాలు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు గిరిబాబు, ఢిల్లీరావు, పాపారావు, వైద్య సిబ్బంది కుమారి, సిహెచ్ రాజీవ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం'

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

రాష్ట్రానికి స్వర్ణయుగం కావాలన్న, అభివృద్ధి చెందాలన్నా టిడిపి పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమవుతుందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటువేయాలని రాష్ట్ర బిసి సాధికారిత కార్యదర్శి బోయిన గోవిందరాజులు అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళి మేజరు పంచాయతీ నాయిబ్రహ్మణుల వీదిలో ఇంటింటికి వెళ్ళి బాబు షుర్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ బాండ్లను టిడిపి నాయకులతో కలిసి అందజేశారు. అలాగే ప్రతి ఇంటికి తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానూ చేపట్టబోయే పథకాలు గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రాగానే తల్లికి వందనం పేరుతో మీ ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒకొక్కరికి ఏడాదికి రూ. 15వేలు, ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్ళు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ. 1500లు దీపం పేరుతో ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్‌లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 20 లక్షల మంది యువతకు ఉపాధి, నిరుగ్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి, ప్రతి రైతుకు ఏటా రూ. 20వేలు ఆర్ధిక సహాయం తదితర సంక్షేమ పథకాలు అందించటం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నౌగాపు నాగరాజ, కమ్మకట్టు అప్పలరాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు. హరిశ్చంద్రపురం పంచాయతీలో మాజీ ఎంపీటీసీ హనుమంతు అప్పలరాజు, చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడులో మాజీ సర్పంచ్ గొండు లక్ష్మణరావు ఆధ్వర్యంలో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

భారతీయ సంస్కృతి వారసత్వం సంపదపై అవగాహన అవసరమని, జిల్లాలో పర్యాటక ప్రదేశాలకు బహుళ ప్రచారాన్ని కల్పించి తద్వారా పర్యాటక ప్రదేశాన్ని తీసు కొచ్చెందుకు విద్యార్థులలో నైపుణ్యం, పరిశుభ్రత, వంటి కార్యక్రమాలు చేపట్టేందుకు యువ పర్యాటక క్లబ్ లు దోహద పడతాయని పర్యాటక అధికారి ఎన్ నారాయణ రావు అన్నారు. శుక్రవారం డా. బి ఆర్ అంబేద్కర్ ఇంజనీరింగ్ కళాశాలలో యువక్లబ్ ను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పర్యాటక ప్రదేశాల్లో ప్లాస్టిక్ వాడడం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్. సిహెచ్ రాజశేఖర్ . కోఆర్డినేటర్ టి.భవాని, క్లబ్ స్టూడెంట్స్ సెక్రటరీ కె .హారిక, వి. యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్న ఎఇ తిరుమలరావు

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఖరీపు సీజన్‌లో రైతులు సాగుచేసిన వరి ధాన్యం కొనుగోలు చేసినప్పుడు ప్రభుత్వం నిర్ధేశించిన నిబంధనలు తప్పక పాటించాలని టెక్కలి వ్యవసాయ సంచాలకులు బి.వి. తిరుమలరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో స్థానిక వ్యవసాయశాఖ ఎఒ ఎస్.గోవిందరావు ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో ధాన్యం కొనుగోలుపై ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసినప్పుడు ధాన్యంలో తేమ 17శాతంకు మించరాదని, ధానంలో మట్టిబెడ్డలు, కవ్వ ఉండకుండ చూడాలన్నారు. కార్యక్రమంలో రైతుభరోసా మండల అధ్యక్షుడు వెలమల కృష్ణారావు, సిఎస్‌డిటి రాము, టీఎలు విశాలాక్షి, ఎం.గౌతమి, రామరాజులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

దోపిడీ పాలనను అంతమొందించాలి

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్రంలో అధికారంలో నున్న వైసిపి ప్రభుత్వం దోపిడీ పాలనని దీనిని అంతమొందించడానికి ప్రతీ టిడిపి కార్యకర్త రానున్న ఎన్నికల్లో సుశిక్షితుడైన సైనికునిలా పనిచేయాలని టెక్కలి మండల టిడిపి అధ్యక్షులు బగాది శేషగిరిరావు కోరారు. శుక్రవారం విలేకర్లుతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ధరలు భారం పెరిగిందన్నారు. విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచారన్నారు. నాసిరకం మద్యం ద్వారా మద్యం ప్రియుల ఆరోగ్యం పాడైపోయిందని ఆరోగ్య విపత్తును కప్పడానికి ఆరోగ్య సురక్ష పేరుతో శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. సమావేశంలో మహిళా అధ్యక్షురాలు మెండ దమయంతి, హనుమంతు రామకృష్ణ, పోలాకి షణ్ముకరావు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు జిల్లాలోని శాఖా గ్రంథాలయాల పరిధిలో ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు తెలిపారు. జిల్లా గ్రంథాలయంలో శాఖా గ్రంథాలయాల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాఖా గ్రంథాలయాధికారులు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గ్రంథాలయాలకు పిల్లలు ఆకర్షితులయ్యే విదంగా వివిద కార్యక్రమాలను రూపొందించాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా వారోత్సవాల పోస్టరును ఆవిష్కరించారు.

పిఆర్‌టియు నూతన కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం: మండల, పట్టణ పిఆర్‌టియు శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బైరి అప్పారావు ఎన్నికల పరిశీలకునిగా, దానేటి కేశవరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన గౌరవ అధ్యక్షులుగా ఎం.రాజా గోపాలం, అధ్యక్షుడుగా సుఖాంత లిమయి, ప్రధాన కార్యదర్శిగా ఎం.చంద్ర శేఖర్, అసోసియేట్ అధ్యక్షుడు టి.గణపతిరావు, ఉపాధ్యక్షులుగా జి. సత్యనారాయణ, మహిళా ఉపాధ్యక్షురాలు సిహెచ్ శశిబాల, కార్యదర్శులుగా శ్యామ్ కుమార్, రాంబాబు, మహిళా కార్యదర్శిగా ఇప్పిలి లలిత ఎన్నికయ్యారు.

విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు సూదికొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అమలుచేస్తున్న వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించివి ద్యార్థుల్లో దృష్టిలోపాన్ని గుర్తించారు. అవసరమైన విద్యార్థులకు కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సిహెచ్ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు మధు, ఎఎన్ఎం శ్రావణి, వైసిపి నాయకులు శిష్టు గోపి, బడగల బల్లయ్య, అంబటి ఆనందరావు పాల్గొన్నారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు అందజేత

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని పెద్ద శ్రీరాంపురం పంచాయతీ పరిధిలో 18 మంది లబ్ధిదారులకు శుక్రవారం స్థానిక ఎంపిటిసి మాదిన విమల చేతులమీదుగా ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉజ్వల పథకంలో 18 మందికి గ్యాస్ కలెక్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాదిన రామారావు, యువ నాయకుడు మాదిన ప్రదీప్, మహిళా సంఘ సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


గ్యాస్ కనెక్షన్లు అందజేస్తున్న ఎంపిటిసి విమల తదితరులు